క్లుప్తంగా

గోవధకు దూరంగా ఉండాలి



నాదెండ్ల: ముస్లింల పవిత్ర పండుగ బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై ఆవుల భాస్కర్ చెప్పారు. నాదెండ్ల పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవధ నిషేధం అమలులో ఉన్నందున ముస్లింలు ఆవులను వధించరాదన్నారు. పండుగకు జంతు బలులు ఇచ్చే ఆచారం ఉన్నందున ఇతర మతస్తులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. చట్టాన్ని ఎవరూ ఉల్లంఘించ వద్దని, అందరూ చట్టప్రకారం నడుచుకోవాలని స్పష్టం చేశారు.

యడ్లపాడులో అత్యాచారం కేసు నమోదు

యడ్లపాడు: యువతిని నమ్మించి మోసం చేసిన యువకుడిపై యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం అత్యాచారం నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యడ్లపాడు మండలం ఉన్నవకు చెందిన యువతిపై అదే ప్రాంతవాసి దంటు సంగీత్ కుమార్ నాలుగేళ్లుగా ప్రేమ పేరుతో వేధించసాగాడు. పెళ్లి చేసుకుంటానంటూ నమ్మబలికి మత్తుమందు ఇచ్చి మోసం చేశాడు. వాటిని వీడియోలు తీసి బెదిరిస్తూ పలుమార్లు లోబరుచుకుని, చివరకు మరో యువతితో వివాహానికి సిద్ధమయ్యాడంటూ బాధిత యువతి పోలీసులను ఆశ్రయించింది. యువతి ఇచ్చిన ఫిర్యాదును మంగళవారం అత్యాచారం కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పైడి రాంబాబు వెల్లడించారు.

అధిక ధరకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు



నరసరావుపేట రూరల్: విత్తనాలను అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ తెలిపారు. పట్టణంలోని విత్తన దుకాణాలు, ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసుల్లో మంగళవారం ఏడీఏ మస్తానమ్మ, ఏఓ వి.నరేంద్రబాబులు తనిఖీలు నిర్వహించారు. విత్తన దుకాణాల్లోని రిజిస్టర్లను పరిశీలించారు. ఎంఆర్‌పీ రేట్లకి మించి అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని దుకాణాల నిర్వాహకులకు స్పష్టం చేశారు. రైతులకు కనిపించే విధంగా ధరల పట్టికను ఏర్పాటుచేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా బిల్లును తీసుకోవాలని సూచించారు. రైతులకు అవసరాలకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తనిఖీల్లో వీఏఏ బోస్, పి.పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు ఢీకొని రెండు పాడి గేదెలు మృతి



శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామ సమీపాన జాతీయ రహదారి మార్గంలో ఆర్టీసీ బస్ ఢీకొని రెండు పాడిగేదెలు మృతి చెందిన సంఘటన సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాలు మేరకు వినుకొండ నుంచి నరసరావుపేట వెళుతున్న ఆర్డీనరీ ఆర్టీసీ బస్ మార్గమధ్యంలో కనమర్లపూడి సమీపంలో గేదెలను ప్రమాదవశాత్తూ ఢీకొనటంతో సంఘటన స్థలంలో మృతి చెందాయి. వీటి విలువ రూ.లక్ష రూపాయలు ఉంటుందన్నారు. ఈపూరు మండలం కొండ్రముట్ల గ్రామానికి చెందిన అలవలపల్లి వెంకట రామిరెడ్డికి చెందిన పాడిగేదెలను పొలాలకు వదిలివేయగా తప్పిపోయి ఇటువైపు వచ్చిన ట్లు బాధితులు చెప్పారు. ఆర్టీసీ డ్రైవరు సమయస్ఫూర్తితో వ్యవరించటం వలన పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ క్లీయర్ చేసి ఆర్టీసి బస్, డ్రైవరును ఆదుపులోకి తీసుకున్నారు.

పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం

రొంపిచర్ల: తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపాలని ప్రధానోపాధ్యాయుడు బి.ఎం.సుభాని అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వపాఠశాలల్లో మంగళవారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిఖాతాలో ప్రభుత్వం అమ్మఒడి పథకం నగదు జమచేస్తుందన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ తవనం రామిరెడ్డి, ఉపాధ్యాయులు ఎస్.రామ కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సునీ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొండకు పండుగొచ్చింది

- ముస్తాబైన వినుకొండ
- తొలి ఏకాదశి పర్వదినానికి ఏర్పాట్లు పూర్తి
- భారీగా భక్తులు వచ్చే అవకాశం
- అఖండ జ్యోతి ప్రజ్వలనకు ఏర్పాట్లు



రామలింగేశ్వర స్వామి ఆలయం



స్వామి వారి మూలవిరాట్

వినుకొండ(నూజెండ్ల): తొలి ఏకాదశి పర్వదినం వేడుకలకు వినుకొండ కొండపై వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. పూర్వం రావణబ్రహ్మ సీతాదేవిని అపహరించుకొని పోతున్న సమయంలో వినుకొండ కొండపైన జఠాయువు ఆయనతో యుద్ధం చేసి ప్రాణాలు కోల్పోయింది. సీత జాడ విని శ్రీరామునికి సీత జాడ తెలియజేసింది. దీంతో సీత జాడ విన్న కొండగా కాలానుగుణంగా వినుకొండగా ప్రసిద్ధి చెందింది. అయితే శ్రీరాముడు చేత ప్రతిష్ఠించబడిన శివలింగం నేటికీ పూజలందుకుంటుంది. కొండపైన రామలింగేశ్వరునికి ప్రతి ఏటా తొలి ఏకాదశి పర్వదినం రోజున భారీ తిరునాళ్ల జరపడం ఆనవాయితీగా వస్తుంది. ఈ నెల 29వ తేదీన తిరునాళ్లను వైభవంగా నిర్వహిస్తున్నారు.

కొండపైకి ఘాట్‌రోడ్డు నిర్మాణం



కొండపై ఏర్పాటు చేసిన అఖండ జ్యోతి

స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో వినుకొండ కొండపైకి ఘాట్‌రోడ్డు నిర్మాణం చేపట్టారు. సుమారు రూ.30 కోట్ల వ్యయంతో కొండపైకి ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. దీంతో భక్తులకు 24 గంటలు దర్శనం అందేలా చర్యలు చేపట్టారు. తిరునాళ్లకు చుట్టు పక్కల గ్రామాల నుంచి 2 లక్షలకు పైగా భక్తులు రానుండటంతో విస్తృత ఏర్పాట్లు చేశారు.

ద్వితీయ అఖండ జ్యోతి ప్రజ్వలన

తమిళనాడులో అరుణాచలం వద్ద గల తిరువన్నావలైలో 72 ఏళ్ల క్రితం అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. భారతదేశంలో అదే పెద్ద అఖండ జ్యోతి. తరువాత హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో వినుకొండ కొండపైన గత తొలి ఏకాదశి పర్వదినం రోజున అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. ద్వితీయ ఏడాది కూడా అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

వెయ్యి కిలోల ఆవు నెయ్యితో 650 మీటర్ల ఒత్తితో అఖండ జ్యోతి వెలిగించనున్నారు. ఈ అఖండ జ్యోతి 21 కిలోమీటర్ల వరకు భక్తులు దర్శించే అవకాశం ఉండటంతో భక్తులకు జ్యోతి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పటిష్ట బందోబస్తు

తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 500మంది పోలీసులు, 250మంది మున్సిపల్ సిబ్బంది సచివాలయాల ఉద్యోగులు భద్రతా ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. తిరునాళ్ల సందర్భంగా సెంట్రల్ లైటింగ్‌తో పాటు ఎస్‌ఎస్‌పీ కాలువపై విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పట్టణంలోని అన్ని రహదారుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

ఘాట్ రోడ్డు నుంచి కొండ పైకి వెళ్లే భక్తుల కోసం పైవరకు బారి గేడ్ల నిర్మాణం, ప్రతి 250 మీటర్లకు తాగునీటి సౌకర్యం, మజ్జిగ, భోజన ప్యాకెట్లు ఏర్పాటు చేశారు. లక్షలాది మంది భక్తులకు అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, దేవాదాయ, విద్యుత్, వైద్య, ఆరోగ్య శాఖలకు సంబంధించి వెయ్యి మందికి పైగా సిబ్బంది భక్తుల సౌకర్యం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నిబంధనలను విధించారు.

కొండకు 30 బస్సులు

వినుకొండ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో 30 బస్సులను కొండపైకి నడుపుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్, కొండ కింద నుంచి నేరుగా దేవాలయం వద్దకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ లాంఛనాలతో ఏర్పాట్లు

రామలింగేశ్వరస్వామి తిరునాళ్ల ప్రభుత్వ లాంఛనాలతో రెండో ఏడాది జరుగనున్నాయి. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కృషితో జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో స్వామి వారి తిరునాళ్లకు నిధులు కేటాయించారు. ఇప్పటికే వినుకొండను సందర్శించిన కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అలాగే జిల్లా యంత్రాంగం మొత్తం కొండ పండుగకు విధులు నిర్వహించనున్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలతో పాటు వ్యాపార అసోసియేషన్‌ల సభ్యులు భక్తుల సౌకర్యం కోసం వివిధ కార్యక్రమాలు చేపట్టారు. స్వామి వారి దేవాలయం ముందు అంగళ్లు ఏర్పాటుతో పాటు స్వామి వారి ప్రసాదాల అమ్మకాలకు అనుమతులు మంజూరు చేశారు.

భారీ విద్యుత్ ప్రభలు

తిరునాళ్లకు 10కు పైగా భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు కొండపైకి విద్యుత్ లైట్లతో అలంకరణతో పాటు స్వామి వారి కార్యక్రమాలను ప్రత్యక్షప్రసారం, ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వాహనాల పార్కింగ్, వీఐపీలకు, వాహనాలకు ప్రత్యేక పాస్‌లు జారీ చేస్తున్నారు.

తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు



వినుకొండ(నూజెండ్ల): తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వినుకొండ కొండపైన రామలింగేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శాంతి ఆశ్రమం ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం సాయి బృందావనం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు మాట్లాడుతూ తొలి ఏకాదశి రోజున కొండపైన ఉదయం 6 గంటలకు గణపతి పూజ, అనంతరం రుద్రసహిత చండీహోమం, సాయంత్రం 5 గంటలకు మహిళలచే విశేష హారతులు తదనంతరం 6.30 గంటలకు అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలను భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో సర్వే

బొల్లాపల్లి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలు అందుబాటులోకి తేవడమే జగనన్న సురక్ష లక్ష్యమని ఎంపీపీ బత్తి రాములు అన్నారు. మండలంలోని రావులాపురం, గండిగనుమల సచివాలయాల్లో జగనన్న సురక్షలో భాగంగా మంగళవారం ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచిత సేవలు ద్వారా ఈ కార్యక్రమంలో అందజేయడం జరుగుతుందని, అర్హత కలిగిన వారు ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులు వివరాలు తెలియపరచాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీ బాషా, శ్రీహరి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉజ్వల భవిష్యత్



తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం కె. అపర్ణ

బొల్లాపల్లి: ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రవేశ పెట్టిన పథకాలను సద్వినియోగపరచుకోవాలని జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.అపర్ణ అన్నారు. బండ్లమోటు జెడ్పీ హైస్కూల్‌లో తల్లిదండ్రుల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ మన బడి, నాడు–నేడు, అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, ఆణిముత్యాలు, ఇంగ్లిష్ మీడియంలో బోధన తదితర పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని తెలిపారు. నాడు–నేడులో భాగంగా పాఠశాల పూర్తిస్థాయిలో అభివృద్ధిలో ఉందని, విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయన్నారు. ఈ పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు, వైద్య పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు ఉచిత మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రులు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటిని పొదుపుగా వాడుకోవాలి



మంచినీటి చెరువు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట: మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కోరారు. పట్టణానికి మంచినీరు సరఫరా చేసే తాగునీటి చెరువులను మంగళవారం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్ర వేసవి ఉష్ణోగ్రతల కారణంగా మంచినీటి రెండు చెరువులలో నీరు కనిష్ఠ మట్టానికి చేరుకుందని వివరించారు. ప్రస్తుతం కొద్ది రోజులకు మాత్రమే సరిపడా నీరు ఉందని వెల్లడించారు. సాగర్ జలాలు విడదల చేసేందుకు సమయం ఉన్నందున చెరువుల్లో ఉన్న కొద్ది నీటి నిల్వలను వృథా కాకుండా జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు కళ్లాపి చల్లేందుకు, పశువులను కడిగేందుకు మంచినీటిని ఉపయోగించరాదని కోరారు. మంచినీరు వృథా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నా రు. త్వరలో సాగర్ జలాలు విడుదల కాని పక్షంలో ప్రస్తుతం రోజు మార్చి రోజు ఇస్తున్న నీటిని రెండు రోజులకు ఒకసారి ఇచ్చే పరిస్థితులు తలెత్తే ప్రమా దం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మున్సిపల్ డీఈఈ తోట వెంకటరమణ, ఏఈఈ జ్యోతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో లేగదూడ మృతి



నాదెండ్ల: లేగదూడపై వీధి కుక్కలు చంపేసిన ఘటన మండలంలోని గణపవరం గ్రామం పశువుల ఆసుపత్రి సమీపంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పాడిరైతు కెల్లంపల్లి వెంకయ్య తెలిపిన వివరాల మేరకు, తన ఇంటి ఎదురు ఉన్న పశువుల పాకలో గేదెలతో పాటూ లేగ దూడలు ఉన్నాయన్నారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో కొన్ని వీధికుక్కలు పశువుల పాకలో చొరబడి లేగదూడపై దాడి చేసినట్లు చెప్పారు. విచక్షణా రహితంగా కరిచి పొట్టభాగాన్ని పూర్తిగా తినేసినట్లు చెప్పారు. ఉదయాన్నే తాను పశువుల పాకకు వెళ్లటంతో దూడ కళేబరం కనిపించింది. పక్కనే పదుల సంఖ్యలో వీధికుక్కలు ఉన్నాయన్నారు. తాను పశుపోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నానని, ఈ ప్రాంతంలో తరచూ వీధి కుక్కలు పశువులపై దాడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో మేకల గుంపుపై వీధికుక్కలు దాడి చేసి 8 మేక పిల్లలను చంపి తినివేశాయన్నారు. రెండు నెలల క్రిందట గ్రామంలో పలు బజార్లలో లేగదూడలను చంపి తినేసిన ఘటనలపై పాడి పోషకులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

లానేస్తం అమలుపై న్యాయవాదుల హర్షం



బార్ అసోసియేషన్ ముందు హర్షం వ్యక్తం చేస్తున్న లీగల్‌సెల్ న్యాయవాదులు

నరసరావుపేట: లా నేస్తం అమలు ద్వారా జూనియర్ న్యాయవాదులు వృత్తిలో నిలదొక్కునేందుకు అవకాశం ఏర్పడుతుందని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ న్యాయవాదులు పేర్కొన్నారు. అర్హులైన జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం పథకం అమలుచేస్తూ నెలకు రూ.5 వేలు చొప్పున ఏడాదికి రూ.60 వేలు, మూడేళ్లకు రూ.1.80 లక్షలు ఆర్థిక సహాయం చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం లా నేస్తం నిధులు విడుదల చేసినందుకుగాను మంగళవారం బార్ అసోసియేషన్ హాలు వద్ద వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ముఖ్యమంత్రి చేస్తున్న సహాయాన్ని హర్షించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు ఏపీపీ కాకుమాను బాలహనుమంత రెడ్డి, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ అధ్యక్షులు ఆరేకూటి శ్రీనివాస్‌రెడ్డి, నరసరావుపేట వైఎస్‌ఆర్సీపీ లీగల్ సెల్ అధ్యక్షులు, ఏజీపీ గాలి జైప్రకాష్, ఏపీపీ బుచ్చి దంతాచారి, న్యాయవాదులు వై.సీతారామరెడ్డి, ఆర్.శ్రీనివాసరావు, సింగం చంద్రశేఖర్, ఎం.రాజా, మల్లెల అశోక్, ఎస్వీ రమణారెడ్డి, కళ్ళం శ్రీనివాస్‌రెడ్డి, షరీఫ్, రాజేష్, గంట రాజేష్, అచ్చి ఏడుకొండలు, ప్రశాంత్, ముల్లా పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



యడ్లపాడు: మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర అధికారుల బృందం మంగళవారం సందర్శించింది. జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాలు- వాటి అమలు పరిశీలనలో భాగంగా ఆకస్మికంగా వచ్చినట్లు బృందం తెలిపింది. పీహెచ్‌లో ద్వారా రోగులకు అందుతున్న వైద్య సేవలు, వివిధ వ్యాధులకు సంబంధించిన పరీక్షల నిర్వహణ, ఆరోగ్య పరికరాల ప్రస్తుత పరిస్థితి, రోగులకు అందించే మందులు నాణ్యత, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పనితీరు, పీహెచ్‌సీ వాటి పరిసరాల పరిశుభ్రత వివరాలపై ఆరా తీశారు. సమయపాలన, ఓపీలు, ఓపీల్లో అధికంగా గుర్తించిన ఆరోగ్య సమస్యలు తదితర అంశాలను ఆరోగ్య సిబ్బందిని అడిగి నమోదు చేసుకున్నారు. ఏపీ స్టేట్ కన్సల్టెంట్-జాతీయ ఆరోగ్య ప్రమాణాల మదింపుదారుల విభా గం రాష్ట్ర అధికారి అడపా వాసుబాబు, పల్నాడు జిల్లా అధికారి డాక్టర్ రామ్‌కుమార్ ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి ఆసుపత్రి నిర్వహణ, వైద్య సేవలు అందించడంపై పలు సలహాలు, సూచనలు అందజేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి గోపీనాయక్, సీహెచ్‌వో పున్నారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడికి పురస్కారం

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లకు చెందిన రంగస్థల కళాకారులు చక్రవరం బలరామరాజు తెలుగు వెలుగు సాహితీ వేదిక వారి ఆధ్వర్యంలో విశిష్ట పౌరాణిక కళారత్న పురస్కారం పొందారు. ఈ సందర్భంగా స్థానిక రాజుల బజారులో మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రంగస్థల కళాకారులు చక్రవరం బలరామరాజు మాట్లాడుతూ తాను 46 సంవత్సరాలుగా రంగస్థల కళాకారుడిగా కొనసాగుతున్నానని అన్నారు. పౌరాణిక నాటకాలకు హార్మోనిస్ట్‌గా పనిచేస్తున్నానని అన్నారు. గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- మూడు వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఒకవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే అభివృద్ధి పనులను వేగవంతంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలో సుమారు రూ.60 లక్షల వ్యయంతో 2, 3, 4 వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు సీసీరోడ్లు, సైడ్ డ్రెయినేజీలు, వాటర్ లైన్, బోరింగులు, కల్వర్టుల నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం పట్టణంలో చేపట్టిన పలు మరమ్మతు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, మున్సిపల్ ఎం.ఇ డి.శ్రీనివాసరావు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

డీఎల్‌డీవో పి.వెంకటరెడ్డి



వేల్పూరులో వలంటిరు యాప్‌లో వివరాలు నమోదు తీరును పరిశీలిస్తున్న అధికారులు

శావల్యాపురం: జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని డీఎల్‌డీవో పి.వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వేల్పూరు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష పథకం అమల తీరుపై గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లుతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎల్‌డీవో వెంకటరెడ్డి మాట్లాడుతూ వచ్చే నెల 1వ తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఇందులో భాగంగా శావల్యాపురం మండలంలో 11 గ్రామసచివాలయాలు ఉండగా వచ్చే నెల 1న కనమర్లపూడి గ్రామసచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. సచివాలయ పరిధిలో 776 నివాస గృహాలు ఉండగా వలంటీర్లు ఇప్పుటి వరకు 491 నివాస గృహాలు సర్వే చేసినట్లు చెప్పారు. మండలంలోని వేల్పూరు1,2 గ్రామ సచివాలయాల్లో వచ్చే నెల 4న సచివాలయాల పరిధిలో శిబిరాలు ఏర్పాటు చేయు సందర్భంగా వలంటీర్లు నివాస గృహాలు చేస్తున్న సర్వేతీరు పరిశీలించి క్షేత్రస్థాయిలో ఎలాంటి లోపాలు లేకుండా ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు మంజూరు చేయటం కోసం జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందన్నారు. వేల్పూరు-1 గ్రామసచివాలయం పరిధిలో 1340, వేల్పూరు-2 సచివాలయం పరిధిలో-1248 నివాస గృహాలు ఉండగా వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్‌లో లబ్ధిదారుల సమగ్ర వివరాలు ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. సంక్షేమ పథకాలు కుల, ఆధాయ, వివాహ, ఫ్యామిలీ, తదితర ఇతర సేవలన్నీ మరింత ప్రజలకు అందుబాటలోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, పంచాయతీ కార్యదర్శులు కొమిటినేని అశోక్ చౌదరి, ఆళ్ళ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

31 అంశాలకు వినుకొండ కౌన్సిల్ ఆమోదం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక పురపాలక సంఘం సమావేశమందిరంతో మంగళవారం సాధారణ సమావేశం జరిగింది. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అంశాలతో 32 కూడిన అజెండాను కౌన్సిల్‌ముందు ప్రవేశ పెట్టగా 31 అంశాలను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. పట్టంలో వీధిలైట్లు కొన్నిచోట్ల సక్రమంగా వెలగటంలేదని, వీధుల్లో కుక్కలు, ఆవులు ఎక్కువగా తిరుగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 19 వార్డు కౌన్సిలర్ ఎంఎస్‌కె బాష సమస్యను తెలియ జేశారు. అలాగే జూనియర్ కళాశాల వాకింగ్ ట్రాక్ వద్ద సాయంత్రం వేళల్లో లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, బావుల్లో పూడిక తీత తీయించి వినియోగంలోకి తేవాలని పలువురు కౌన్సిలర్లు చెప్పారు. దీనికి స్పందించిన చైర్మన్ రానున్న సమావేశంలో సభ్యులు అడిగిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని చెప్పారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్మన్ వెంకయ్యను సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద పథకం పారదర్శకంగా నిర్వహించాలి



రాగిజావ తాగుతున్న విద్యార్థులు

శావల్యాపురం: జగనన్న గోరుముద్ద పథకం పారదర్శకంగా అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాలని చేస్తామని మండల విద్యాశాఖాధికారి పుసులూరి లలితాకుమారి వెల్లడించారు. మంగళవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఏంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు మండలంలోని 15 గ్రామ పంచాయతీలో 39 ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరుపై క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేస్తామన్నారు. ఇందుకుగాను మధ్యాహ్న భోజన పథకం మెను ప్రకారం అమలు జరిగేలా ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు క్రమం తప్పకుండా వంటకాలు రుచులు చూసిన తదుపరి విద్యార్థులకు వండించాలన్నారు. ఫిర్యాదులకు తావులేకుండా ఉపాధ్యాయులు, పేరెంట్ కమిటీ చైర్మన్లు, విద్యార్థుల తల్లిదండ్రులు కీలకపాత్ర పోషించాలన్నారు. సీఆర్‌పీ రావూరి శివప్రసాదు, లింగాల శ్రీహరి, ఏలికా శ్రీనివాసరావు ఉన్నారు.